అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

అంచన్‌పల్లి పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న డీఈవో రవీందర్

- జిల్లా విద్యాధికారి రవీందర్

గండీడ్, మే 30: ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి రవీందర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాల కోసం భవనాలను పరిశీలించారు. అనంతరం మండలంలోని అంచన్‌పల్లి ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పాఠశాలలు ప్రారంభం నాటికి పనులన్నీ పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా మంజూరైన కేజీబీవీ పాఠశాల తరగతులు ఈ ఏడాది నుంచి గండీడ్‌లో జరుగుతాయని, పక్కా భవనం కోసం రెండు భవనాలను ఎంపిక చేశామని వాటికి సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు నివేదికలు పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఎంవో బాలుయాదవ్, ఎంపీడీవో దేవన్న, ఎంఈవో వెంకటయ్య ఉన్నారు.

విద్యార్థుల దుస్తులు సకాలంలో అందించాలి

హన్వాడ, మే 30: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే యూనిఫాంలను సకాలంలో అందించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని డీఈవో రవీందర్ అన్నారు. గురువారం మండలంలోని పుల్లోనిపల్లి, హన్వాడ, ఇబ్రహీంబాద్ పాఠశాలల్లో చేపట్టిన పనులను పరిశీలించారు. అలాగే విద్యార్థుల కోసం కుడుతున్న దుస్తులను పరిశీలించి, మాట్లాడారు. కుట్టు మిషన్ వారికి సకాలంలో డబ్బులు అందిస్తామన్నారు. ఆయా పాఠశాలల్లో పనులను సకాలంలో పూర్తి చేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రాజునాయక్, ఎంపీడీవో యశోదరమ్మ పాల్గొన్నారు.

పాఠశాలల్లో వసతులు కల్పించాలి

దేవరకద్ర, మే 30: ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఎంపీడీవో శ్రీనివాసులు సూచించారు. గురువారం మండల పరిధిలోని పెద్దరాజమూర్, చిన్నరాజమూర్, నాగరం, కోయిల్‌సాగర్‌లోని ప్రాథమిక పాఠశాలల్లో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో ఎంపికైన అన్ని ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులను వెంటనే పూర్తిచేయాలని చెప్పారు. పాఠశాలల ప్రారంభం నాటికి తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి వసతులు కల్పించాలని సూచించారు.

మహ్మదాబాద్ మండలంలో..

మహ్మదాబాద్, మే 30: పాఠశాలల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో దేవన్న చెప్పారు. గురువారం మండలంలోని ముందలి తండాలో ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాలలు ప్రారంభం నాటికి పనులు పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటయ్య తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికులు పేర్లు నమోదు చేసుకోవాలి

- జిల్లా లేబర్ అధికారి రాజ్‌కుమార్

జిల్లా లేబర్ అధికారికి దరఖాస్తులు ఇస్తున్న కార్మికులు

నారాయణపేట టౌన్, మే 30: భవన నిర్మాణరంగంలో పనిచేస్తున్న కార్మికులు సంక్షేమ మండలి బోర్డులో తమ పేర్లు నమోదు చేసుకొని గుర్తింపు కార్డులు పొందాలని జిల్లా లేబర్ అధికారి రాజ్‌కుమార్ సూచించారు. గురువారం భవన నిర్మాణ కార్మికులతో ఆయన మాట్లాడుతూ సంక్షేమ మండలి బోర్డులో గుర్తింపు పొందితే కార్మికుడు లేదా కార్మికురాలి కూతురి పెళ్లికి, కూతురు రెండు కాన్పులకు రూ.30వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.6లక్షల 30వేలు, సహజ మరణం పొందితే రూ.లక్షా 30వేలు సం క్షేమ మండలి బోర్డు ద్వారా అందిస్తారని తెలిపారు. అదేవిధం గా హెల్త్ చెకప్ ద్వారా 42రకాల రోగాలకు వై ద్య పరీక్షలు ఉచితంగా చేస్తారని, కా ర్మికుల ఆరోగ్య పరిరక్షణకు తగిన వై ద్యం అం దించేందుకు ప్రభుత్వ దవాఖానలకు పంపిస్తామని పేర్కొన్నారు. కార్మికుల పని లో నైపుణ్యత పెంపొందించేందుకు వేతనంతో కూడిన శిక్షణ తరగతులు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందజేస్తామన్నారు. అనంతరం సంక్షేమ మండలి బోర్డులో పేర్ల నమోదు కోసం నూతన కార్మికులతో దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం, జిల్లా నాయకుడు హన్మంతు పాల్గొన్నారు.

యూనిఫామ్స్‌ను అందుబాటులో ఉంచాలి



యూనిఫామ్స్ పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

నారాయణపేట, మే 30: పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా యూనిఫాంలను అందుబాటులో ఉంచాలని అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్ అన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలోని 5వ వార్డులో ఉన్న మహిళా కమ్యూనిటీ భవనంలో పట్టణ మహిళా సంఘం సభ్యులు కుడుతున్న యూనిఫాంలను ఆయన పరిశీలించారు. అనంతరం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సందర్శించి స్కూల్ యూనిఫాం స్టిచ్చింగ్‌ను ఆయన పరిశీలించారు. అదేవిధంగా డీఆర్డీఏ కార్యాలయాన్ని తనిఖీ చేసి వివిధ విభాగాలను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్డీవో రాజేశ్వరి, అదనపు డీఆర్డీవో అంజయ్య, కమిషనర్ సునీత పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

బాలానగర్, మే 30 : మండలంలోని ఈదమ్మగడ్డతండాలో ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై తిరుపాజీ కథనం ప్రకారం... ఈదమ్మగడ్డతండాకు చెందిన నేనావత్ శంకర్‌నాయక్ భార్య అంజమ్మ (41) బుధవారం మధ్యాహ్నం ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసుకున్నది. కుటుంబ సభ్యులు ముందు గా మహబూబ్‌నగర్ దవాఖానకు అటు నుంచి హైదరాబాద్ ఉస్మానియా దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున ఆమె మృతి చెందింది.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, SEETHAVARI SAILATHA D/o SEETHAVARI GAJENDAR (Old Name), H.No: 40-8, Bandar nagar, Wanaparthy Town & Dist, Telangana State, hereby declare that my name is changed as AYYOMOLA LATHA W/o AYYOMOLA NAVEEN KUMAR (New Name)

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేయాలి

- స్ట్రాంగ్ రూంను పరిశీలించిన కలెక్టర్ రవి, ఎస్పీ హర్షవర్ధన్

పీయూలోని ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రవినాయక్, ఎస్పీ హర్షవర్ధన్

పాలమూరు/మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, మే 30 : లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఎన్నికల లెక్కింపు కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్ సూచించారు. గురువారం పాలమూరు యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూం, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ కౌంటింగ్ కోసం ఏర్పాట్లు చేసే గదులు, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. లెక్కింపు టేబుళ్ల కూర్పు, అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్ల ప్రవేశం, ఈవీఎంల కదలికలపై సూచనలిచ్చారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. సీసీ కెమెరాలు, లైటింగ్, బారికేడ్లు, పార్కింగ్ ఏర్పాట్లపై సూచనలు చేశారు. అకాడమీ భవనంలో మీడియా సెంటర్ కోసం అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు చేపట్టిన చర్యలు పరిశీలించారు. జనరేటర్ సదుపాయం ఉండాలని, లెక్కింపు ప్రక్రియ భద్రతా చర్యల గురించి ఎస్పీతో కలిసి చర్చించి, సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, అదనపు ఎస్పీ రాములు, డీఎస్పీ రమణారెడ్డి, ఆర్‌డీవో నవిన్, పీఆర్ ఈఈ నరేందర్‌రెడ్డి, డీపీఆర్‌వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ కేంద్రాల పరిశీలన

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జూన్ 2న జరగనున్న మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ శాసనమండలి ఉప ఎన్నిక కౌంటింగ్ ఏర్పాట్లను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్, ఎస్పీ హర్షవర్ధన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కౌంటింగ్‌కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు తదితరులు ఉన్నారు.

ఈవీంల వద్ద భద్రతా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

ఈవీంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూంల వద్ద ఉన్న భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మహబూబ్‌నగర్ ఎస్పీ హర్షవర్ధన్ సూచించారు. గురువారం పాలమూరు యూనివర్సిటీలో పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంల వద్ద పోలీసు భద్రత, సీసీ కెమెరాల పనితీరు, పోలీసు సిబ్బంది విధుల నిర్వహణను ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ స్ట్రాంగ్‌రూంల వద్ద భద్రత కట్టుదిట్టంగా ఉండాలని ఆదేశించారు. రాష్ట్ర, కేంద్ర పోలీసు బలగాల మూడంచెల పహారా ఉండాలని, జూన్ 4వ తేదీ వరకు 24గంటల పాటు సీసీ నిఘాతో పాటు భద్రత ఉండాలని చెప్పారు. ఎస్పీ వెంట శిక్షణ ఐపీఎస్ చిత్తరంజన్, అదనపు ఎస్పీ రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్ కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, డీటీసీ డీఎస్పీ నర్సింహులు, నారాయణపేట డీఎస్పీలు, సీఐ గాంధీ నాయక్, రిజర్వుడు పోలీసు అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సీడ్ కంపెనీలో కలెక్టర్ తనిఖీలు

సీడ్స్ కంపెనీలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

భూత్పూర్, మే 30: పట్టణంలోని పాలమూరు సీడ్స్ ప్రాసెసింగ్ యూనిట్‌ను కలెక్టర్ రవికుమార్ గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పత్తి విత్తనాల స్టాక్‌ను, స్టాక్ బోర్డ్, లాట్ నెంబర్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు నష్టం జరగకుండా వ్యవసాయ శాఖకు సంబంధించిన అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టిని పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్, ఏడీఏ యశ్వంత్‌రావు, ఏవో మురళీధర్ తదితరులు ఉన్నారు.

విత్తనాల కొరత లేదు

- నకిలీ విత్తనాలు అరికట్టేందుకు బృందాలుగా అధికారులు
- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ అర్బన్, మే 30: జిల్లాలో రైతులు విత్తనాల గురించి ఎటువంటి ఆందోళన చెందవద్దని, సరిపడినన్ని అందుబాటులో ఉన్నాయని మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్ అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయం నుంచి రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావుతో కలిసి విత్తనాల లభ్యత, నకిలీ విత్తనాల అరికట్టుటపై పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో వెబెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 22 ఆగ్రో రైతుసేవా కేంద్రాలు, 13 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా రైతులకు జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు తగినన్ని అందుబాటులో ఉన్నాయన్నారు. అలాగే లైసెన్స్ ఔట్‌లెట్‌ల ద్వారా పత్తి విత్తనాల ప్యాకెట్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు సాగు యాజమాన్య పద్ధతుల ఆధారంగా దిగుబడి ఉంటుందన్నారు. నకిలీ విత్తనాలు అరికట్టేందుకు పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో జిల్లా, మండల స్థాయి టీంలు ఏర్పాటు చేశామని తెలిపారు. విత్తన ఔట్‌లెట్‌లలో టీమ్‌లు తనిఖీలు నిర్వహిస్తాయని, నకిలీ విత్తనాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాయని చెప్పారు. నకిలీ విత్తనాల నియంత్రణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రాములు, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సహకార అధికారి పద్మ, ఆర్‌డీవో నవీన్ తదితరులు అన్నారు.

వాహనాలను కండీషన్‌లో ఉంచుకోవాలి

వాహనాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ యోగేశ్ గౌతమ్

నారాయణపేట, మే 30: పోలీస్ వాహనాలను కండీషన్‌లో ఉంచుకోవాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ అన్నారు. గురువారం పట్టణంలోని పరేడ్ మైదానంలో పోలీస్ వాహనాలను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలు కాపాడడంలో పోలీస్ వాహనాలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని, వాహనాలకు ఎలాంటి మరమ్మతులు ఉన్నా వెంటనే చేయించుకోవాలన్నారు. రాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహించే వాహనాలు నిరంతరం తిరిగేలా చూడాలన్నారు. వాహన డ్రైవర్లు డ్రైవింగ్‌పై , మెకానిజంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేంద్రుడు, రియాజ్‌హుల్ హక్, ఆర్ఎస్సై శివశంకర్ పాల్గొన్నారు.

పాఠశాల పనులు పూర్తి చేయాలి

మహబూబ్‌నగర్ అర్బన్, మే 30: అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక వసతుల కల్పన, యూనిఫాం ఒక జత పంపిణీని జూన్ 6వ తేదీలోగా పూర్తి చేయాలని మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. గురువారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లో ఎంపీడీవో, ఎంపీవో, ఎస్ఎంవో, ఇంజినీర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఈవో రవిందర్ పాల్గొన్నారు.

జూన్ 2న పీయూలో రాష్ట్ర అవతరణ వేడుకలు

పాలమూరు, మే 30: మహబూబ్‌నగర్ పాలమూరు విశ్వవిద్యాలయంలో జూన్ 2వ తేదీన శనివారం ఉదయం 9గంటలకు తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పీయూ రిజిస్ట్రార్ ప్రొ. పిండి పవన్‌కుమార్ తెలిపారు. ఈ వేడుకలకు పీయూ కళాశాలల ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు, నాన్ టీచింగ్, టీచింగ్ సభ్యులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరుకావాలని తెలిపారు.

తాళం వేసి ఇంట్లో చోరీ

జడ్చర్లటౌన్, మే 30 : జడ్చర్ల పట్టణంలోని గౌరీ శంకర్‌కాలనీలో తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన గురువారం చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. గౌరీశంకర్‌కాలనీలో నివాసముంటున్న శ్రావణి అనే మహిళ ఇంట్లో దొంగలు ఇంటి తాళాన్ని విరగొట్టి బీరువాలో ఉన్న 3 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బుధవారం ఇంటికి తాళం వేసి శ్రావణి కుటుంబసభ్యులతో కలిసి స్వగ్రామమైన కోడ్గల్‌కు వెళ్లింది. గురువారం ఉదయం తిరిగి ఆమె ఇంటి కొచ్చి చూడగా ఇంటికి వేసిన తాళం విరిగి, ఇంట్లో సామన్లు చిందరవందరగా పడి ఉండడంతోపాటు బీరువాలోని బంగారు ఆభరణాలు దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

గుర్తింపు పొందిన డీలర్లతోనే విత్తనాలు కొనాలి

జానంపేటలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ యశ్వంత్‌రావు

మూసాపేట, జూన్ 30 : వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని ఏడీఏ యశ్వంత్‌రావు సూచించారు. మూసాపేట మండలం జానంపేటలోని రైతువేదికలో గురువారం ఆయన రైతులకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. లూజు విత్తనాలను రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయవద్దని చెప్పారు. ఎవరైనా లూజు విత్తనాలు విక్రయిస్తే వెంటనే సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు. దిగుబడి వచ్చే వరకు రసీదుతో పాటు, విత్తన ప్యాకెట్‌లను భద్రపరుచుకోవాలని సూచించారు. అదేవిధంగా భూముల రకాలు, వాటిలో ఏ విధమైన పంటలు పండించాలో అవగాహన కల్పించారు. పచ్చిరొట్ట ఎరువుల వాడకం, లాభాలు, పంట మార్పిడి, పెంట ఎరువు వల్ల కలిగే ప్రయోజనం గురించి వివరించారు. కార్యక్రమంలో ఏవో రాజేందర్ రెడ్డి, ఏఈవో శివలీల తదితరులు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీ

భూత్పూర్, మే 30: పట్టణంలోని విత్తన దుకాణాల్లో గురువారం ఏఎస్పీ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో విజిలెన్స్, వ్యవసాయాధికారులు తనిఖీలు నిర్వహించారు. జయరామ ట్రేడర్స్, పోతులమడుగులోని మా అగ్రి బయోటెక్ ప్రాసెసింగ్ యూనిట్‌లో తనిఖీలు చేశామని మండల వ్యవసాయాధికారి మురళీధర్ తెలిపారు. బీజీ-3టెస్ట్ నిర్వహించినట్లు తెలిపారు. రైతులను మోసం చేస్తే సహించేదని అధికారులు హెచ్చరించారు. రైతులు కొన్న ప్రతి ప్యాకెట్‌కు రశీదు తీసుకోవాలని, తీసుకున్న రశీదును పంట కాలం ముగిసే వరకు భద్రపరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ యశ్వంత్‌రావు, ఏడీఏ అగ్రికల్చర్ విజయకుమార్, ఎస్సై గణేశ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- మహబూబ్‌నగర్ జిల్లాలో 278మంది, పేట జిల్లాలో 99 మంది విద్యార్థుల గైర్హాజరు

పాలమూరు, మే 30: మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఐదో రోజు ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి డా.శ్రీధర్‌సుమన్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గురువారం ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్ష నిర్వహించారు. 21 కేంద్రాల్లో మొదటి సంవత్సరం విద్యార్థులు 3,023 మంది పరీక్ష రాశారు. 172 మంది గైర్హాజరయ్యారు. రెండో సంవత్సరంలో 1,339 మంది హాజరుకాగా 106మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్లు, అడిషనల్ సీఎస్ డిపార్ట్‌మెంటల్ అధికారులు, కస్టోడియన్లు, ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు, డీఈసీ డిపార్ట్‌మెంట్ అధికారులు పర్యవేక్షించారని తెలిపారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

నారాయణపేటరూరల్, మే 30: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు గురువారం ప్రశాంతంగా కొనసాగాయి. ప్రథమ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు గాను సెట్ నెంబర్-బి ప్రశ్నపత్రం ఎంపిక చేశారు. జనరల్‌లో 1,484 మందికి 1,422 మంది పరీక్షకు హాజరుకాగా, 62మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ ప్రథమ సంవత్సరంలో 55మంది విద్యార్థులకు 50మంది హాజరుకాగా, ఐదుగురు గైర్హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరం ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలకు సెట్ నెంబర్-బి ఎంపిక చేశారు. జనరల్‌లో 529 మంది విద్యార్థులకు 500మంది హాజరుకాగా, 29 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 27మంది విద్యార్థులకు గాను 24మంది విద్యార్థులు హాజరుకాగా, ముగ్గురు గైర్హాజరయ్యా రు. డీఈసీ బృందం నారాయణపేట, మక్తల్, ఫ్లయింగ్‌స్క్వాడ్ బృందం మద్దూర్, కోస్గి, సిట్టింగ్ స్క్వాడ్ బృందం మద్దూర్, మరికల్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షలన్నీ ప్రశాంతంగా జరిగినట్లు పరీక్షల కన్వీనర్ సుదర్శన్‌రావు తెలిపారు.

కబడ్డీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

ఓటమి.. గెలుపునకు నాంది

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్ టౌన్, మే 30: క్రీడల్లో ఓటమి.. గెలుపునకు నాంది అని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. మక్తల్ మండలం గడ్డంపల్లిలో సౌరమ్మ జాతర సందర్భంగా మాజీ ఎంపీపీ గడ్డంపల్లి హనుమంతు ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీల ఫైనల్ మ్యాచ్‌ను బీకేఆర్ ఫౌండేషన్ అధినేత బాలకృష్ణారెడ్డి తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. గడ్డంపల్లి హనుమంతుని అభినందించారు. విజేతగా నిలిచిన తుంకూర్ జట్టుకు బీకేఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి రూ.25వేలు నగదు బహుమతి అందజేశారు. సదాశివపేట చెందిన జట్టు ద్వితీయ స్థానంలో నిలువగా, మక్తల్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు కావలి శ్రీహరి రూ.20వేలు బహుమతిగా అందించారు. మూడు, నాలుగు స్థానాల్లో నిలిచిన జట్లకు బాలకృష్ణారెడ్డి నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీపీలు, గ్రామస్తులు, క్రీడాకారులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

మరికల్, మే 30 : మండల స్థాయి క్రికెట్ పోటీల విజేతలకు మండలంలోని తీలేరులో గురువారం నారాయణపేట డీసీసీ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి బహుమతులు అందజేశారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమాన దృష్టితో స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రేవతమ్మ, గ్రామస్తులు రాము, శ్రీనివాసులు, బజారప్ప, శివరాములు, భగవంతు, కుర్మన్న తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు సబ్సిడీపై అందజేయాలి

తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏఐపీకేఎస్ నాయకులు

నారాయణపేట, మే 30: రైతులకు ఎరువులు, విత్తనాలను ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై అందజేయాలని ఏఐపీకేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డి అన్నారు. గురువారం ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో తాసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు సరిపడా జీలుగ విత్తనాలను ఇవ్వడంలేదని, డిమాండ్‌కు సరిపడా విత్తనాలు సరఫరా చేయాలన్నారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలను 50శాతం సబ్సిడీతో ఇవ్వాలని, దళిత, గిరిజన సన్నకారు రైతులకు ఉచితంగా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐపీకేఎస్ మండల కార్యదర్శి బాలకృష్ణ, సీపీఐఎంఎల్ మాస్‌లైన్ నాయకులు రాము, నరసింహ, నారాయణ, అరుణోదయ జిల్లా కార్యదర్శి అంజి పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేయాలి

ధన్వాడ, మే 30 : రైతులకు సరిపడినన్ని సబ్సిడీ విత్తనాలు వెంటనే పంపిణీ చేయాలని రైతు సంఘం జిల్లా నాయకుడు కృష్ణయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 50శాతం రాయితీతో రైతులకు విత్తనాలు, అలాగే పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను విస్మరిస్తోందని ఆరోపించారు. అనంతరం తాసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజు, శ్రీనివాసులు, గణేశ్, తిర్మలయ్య, బాలప్ప, నర్సింహులు, రాములు పాల్గొన్నారు.

కార్మికుల హక్కుల కోసం పోరాటం

నారాయణపేటలో సీఐటీయూ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్, మే 30: సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలపై సీఐటీయూ నిరంతరం పోరాటాలు చేస్తుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి బాల్‌రాం అన్నారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఐక్యత-పోరాటం నినాదంతో 1970వ సంవత్సరంలో సీఐటీయూ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు హన్మంతు, కోశాధికారి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధన కోసం ఉద్యమించాలి

జడ్చర్లటౌన్, మే 30 : కార్మికుల హక్కుల సాధన కోసం సమిష్టిగా ఉద్యమించాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా గురువారం మున్సిపల్ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, కేశవులు, జంగయ్య, కృష్ణ, విజయ్‌కుమార్, నర్సింలు, అలివేలు, యాదమ్మ, భీమమ్మ, సహదేవ్, మొగులమ్మ, స్వరూప, అంజమ్మ పాల్గొన్నారు.

'పద్మ' అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట టౌన్, మే 30: జిల్లాలోని వివిధ కళారంగాల్లో ప్రతిభ కనబరిచిన మేధావులు, కళాకారులు ప్రభుత్వం అందించే పద్మ అవార్డులకు జూన్ 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి వెంకటేశ్ గురువారం ప్రకటనలో తెలిపారు. కళలు, ఆటలు, సంఘసేవ, విద్య, వైజ్ఞానిక, శాస్త్ర, సాంకేతికం, పరిశ్రమలు, వ్యాపారం తదితర రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారు తమ సేవా కార్యక్రమాలను 800 పదాలకు మించకుండా రాసి అవసరమైన డాక్యుమెంట్ హార్డ్ కాపీ, పీడీఎఫ్‌లో నాలుగు జతల కాపీలను జిల్లా క్రీడల అభివృద్ధి కార్యాలయంలో అందజేయాలని కోరారు.

మొక్కుబడిగా సామాజిక తనిఖీ

మిడ్జిల్, మే 30 : మండల పరిషత్ కార్యాలయలంలో రెండురోజుల పాటు ఉపాధిహామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక మొక్కుబడిగా సాగింది. మండలంలోని 2023-మార్చి 2024 ఏడాదిలో జరిగిన రూ.4 కోట్ల ఉపాధిహామీ పనులపై సమీక్ష నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం సభ్యులు క్షేత్రస్థాయిలో పలు తప్పిదాలను గుర్తించినప్పటికీ అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఏ ముసాయిదాబేగం, ఏపీడీ శ్రీపాద్, ఏపీవో శృతి, ఎంపీడీవో గీతాంజలి, ఏపీవో రాజేశ్‌తోపాటు సిబ్బంది ఉన్నారు.

ఫంక్షన్‌హాల్‌లో అగ్నిప్రమాదం

జడ్చర్లటౌన్, మే 30 : పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలోని జీనత్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం అగ్నిప్రమాదం చోటుచేసుకున్నది. దీంతో కుర్చీలు, సామగ్రి దగ్ధమమైంది. ఫంక్షన్‌హాల్‌లో ఒక్కసారిగా మంటలు, పొగలు వ్యాపించటంతో స్థానికులు గుర్తించి వెంటనే మంటలను చల్లార్చారు. ఫంక్షన్‌హాల్ యాజమాని బద్రు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.